www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 5 నవంబర్ 2024
5
ఏలూరు

6న భీమడోలులో ఉద్యోగమేళా

ప్రజాశక్తి - భీమడోలు

స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల వేదికగా ఈ నెల ఆరో తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (సీడాప్), జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇన్‌ఛార్జి కిశోర్ తెలిపారు. దీనిలో పొట్టం (రిటైల్), ఒరి జియో (ఫైనాన్స్), పేటిఎం, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరై దరఖాస్తుదారులతో ముఖాముఖి నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. సుమారు 160 వరకు ఉద్యోగాల కల్పన లక్ష్యంగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు హాజరవుతారని చెప్పారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగులతోపాటు ఐటిఐ చదివిన వారు సైతం హాజరు కావచ్చునని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువత తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఇతరాలు జిరాక్స్ కాపీలతో ముఖాముఖికి హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి

ఉప ఎన్నిక షురూ



- గోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికకు షెడ్యూల్ విడుదల
- షేక్ సాబ్జీ మరణంతో అనివార్యమైన ఉప ఎన్నిక
- 11న నోటిఫికేషన్, 18 వరకూ నామినేషన్ల ప్రక్రియ
- డిసెంబర్ 5న పోలింగ్, 9న ఓట్ల లెక్కింపు
- గెలుపొందే ఎంఎల్‌సి పదవి కాలం 2027 మార్చి వరకూ
- గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓటర్లు సుమారు 16 వేల మంది
- ఆరో తేదీన ఓటర్ల తుదిజాబితా విడుదల
- పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో గోపీమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల నగారా మోగింది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను సోమవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఈ నెల 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, 18వ తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ సాగనుంది. 19న పరిశీలన, 21 వరకూ నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగనుంది. డిసెంబర్ ఐదో తేదీన ఉదయం ఎనిమిది గంటల నుంచి నాలుగు గంటల వరకూ పోలింగ్ జరగనుంది. డిసెంబర్ తొమ్మిదో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. రెండు జిల్లాల్లోని దాదాపు 16 వేల మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధమవడంతో ఎన్నికల ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నిక 2021 మార్చిలో జరిగింది. ఆ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన షేక్ సాబ్జీ అఖండ విజయం సాధించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపులోనే విజయకేతనం ఎగురవేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలతోపాటు, ప్రజల సమస్యలపై సాబ్జీ సమర్థవంతంగా పనిచేశారు. ప్రజల అభిమానం చూరగొని ముందుకు సాగుతున్న తరుణంలో 2023 డిసెంబర్ 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో సాబ్జీ మృతి చెందారు. దీంతో రెండు జిల్లాల్లోని ఉపాధ్యాయ, ఉద్యోగులతోపాటు ప్రజానీకం అంతా తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. ఆయన అంత్యక్రియలకు వేలాది మంది తరలివచ్చి నివాళులు అర్పించారు. ఎంఎల్‌సి పదవీకాలం ఆరేళ్లు ఉండగా సాబ్జీ దాదాపు రెండున్నరేళ్లు మాత్రమే పదవిలో ఉన్నారు. ఇంకా దాదాపు మూడున్నరేళ్ల పదవీకాలం ఉండటంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికకు సంబంధించి ఓటర్ల నమోదు, ముసాయిదా జాబితా వంటివి పూర్తి చేసి ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది.

దాదాపు 16 వేల మంది ఉపాధ్యాయ ఓటర్లు

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో జులై 29 నుంచి ఓటుహక్కు నమోదు ప్రారంభించారు. సెప్టెంబర్ మూడో తేదీ వరకూ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ఓట్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 14,191 మంది దరఖాస్తు చేసుకోగా, పరిశీలన అనంతరం 13,677 మందికి ఓటుహక్కు కల్పించారు. అక్టోబర్ 24న ముసాయిదా జాబితాను ప్రకటించారు. తర్వాత 2,771 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. తుది ఓటర్ల జాబితాను ఈ నెల ఆరో తేదీన ప్రకటించనున్నారు. దాదాపు 16 వేల మంది ఓటర్లు ఉండనున్నట్లు తెలిసింది. 2021లో జరిగిన ఎన్నికల్లో 17 వేల మందికిపైగా ఓటర్లు ఉండగా, ఈసారి ఓటర్ల సంఖ్య తగ్గే పరిస్థితి నెలకొంది.

ఎన్నికల కోడ్ అమల్లోకి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించడంతో సోమవారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎన్నిక పూర్తయ్యే వరకూ కొత్త పనులకు శంకుస్థాపన చేయడం, ప్రారంభోత్సవాలు చేయకూడదు. ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేస్తారో, లేదో వేచిచూడాలి.

పిడిఎఫ్ అభ్యర్థిగా గోపీమూర్తి

2021లో జరిగిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా షేక్ సాబ్జీ గెలుపొందారు. అంతకుముందు రాము సూర్యారావు పిడిఎఫ్ నుంచి గెలుపొందారు. ఈసారి జరగనున్న ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి బరిలోకి దిగుతున్నారు. ఇప్పటికే ఆయన రెండు జిల్లాల్లో ఉపాధ్యాయులను, సంఘాల నాయకులను కలిసి మద్దతు కోరుతూ ముందుకు సాగుతున్నారు. అధికారపక్షం కూటమి నుంచిగాని, ప్రతిపక్ష వైసిపి నుంచిగాని అభ్యర్థులను బరిలోకి దింపే అవకాశం ఉండదని తెలుస్తోంది. గెలిచిన అభ్యర్థి పదవీ కాలం 2027 మార్చి వరకూ మాత్రమే ఉండనుంది. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు వెనకంజ వేస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఉభయగోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రతిసారీ పిడిఎఫ్ బలం గా పోటీ ఇవ్వడమే కాకుండా విజయకేతనం ఎగురవేస్తోంది. ఒకవేళ పోటీ చేసి నా గెలిచే అవకాశాలు ఉండవనే అభిప్రాయం అధికార, ప్రతిపక్ష నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఇతర అభ్యర్థులు ఎవరైనా బరిలోకి దిగుతారో, లేదో ఒకటి, రెండు రోజుల్లో తెలిసే అవకాశం ఉంది. ఏదేమైనా ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉభయగోదావరి జిల్లాలు పిడిఎఫ్‌కు కంచుకోట అని చెప్పొచ్చు.

ఇదేం చోద్యం..!

- గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓట్లు నమోదు చేయించాలని అధికారులపై ఒత్తిడి
- గతంలో ఈ విధానం లేదని అధికారుల పెదవి విరుపు
- జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 30 వేల ఓటర్లు మాత్రమే నమోదు
- రేపటితో ముగుస్తున్న తుది గడువు

ప్రజాశక్తి - భీమవరం

పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటర్ల నమోదులో అధికార యంత్రాంగంపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారపక్షమైన కూటమి నుంచి ఎంఎల్‌సి అభ్యర్థిని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ అభ్యర్థిని ఎలాగైనా గెలిపించాలనే తాపత్రయంతో అధికారపక్షం ఆపసోపాలు పడటంతోపాటు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగానికి పూనుకుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్ల నమోదుకు అధికారులు వివిధ రూపాల్లో అవగాహనా కార్యక్రమాలు ఇప్పటికే నిర్వహించారు. వివిధ సంఘాలు, సంస్థలు కూడా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుకు కృషి చేశాయి. అయితే గ్రాడ్యుయేట్లలో నిరాసక్తతో, లేక గడువు పొడిగిస్తారనే భావనోగాని ఓటర్ల నమోదు మందకొడిగా సాగుతోంది. ఈ క్రమంలో అధికారులు వీలైనంత వరకూ రోజువారీ కార్యక్రమాలతోపాటు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్ల నమోదుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. అయితే కూటమి నేతలు మాత్రం క్షేత్రస్థాయిలో గ్రాడ్యుయేట్లను గుర్తించి వారి ఓట్ల నమోదుకు ప్రయత్నించకుండా అధికార యంత్రాంగం ద్వారా ఓట్ల నమోదుకు ప్రయత్నిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. దీనిపై ఏలూరు జిల్లాలో చింతలపూడి, కైకలూరు తదితర నియోజకవర్గాల్లో అధికారపక్షమైన కూటమి నిర్వహించిన సదస్సుల్లో అధికారులు పాల్గొనడం, ఎంఎల్ఎల ఇళ్లకు దరఖాస్తులు తీసుకుని రావాలని ఉపాధ్యాయులకు ఎంఇఒలు ఆదేశాలివ్వడంపై కలెక్టర్‌కు సైతం ప్రజాసంఘాలు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అదే తరహాలో కాకపోయినా పశ్చిమగోదావరి జిల్లాలోనూ కూటమి నేతలు మండల అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. బిఎల్ఒలు, విఆర్ఒలకు స్పష్టమైన ఆదేశాలిచ్చి గ్రామస్థాయిలో డిగ్రీ పూర్తి చేసిన వారిని గుర్తించాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా కేవలం 30 వేల మంది మాత్రమే ఓటర్లుగా నమోదయ్యారు. ఈ నెల ఆరో తేదీ బుధవారంతో ఓట్ల నమోదు గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నడూ లేనంతగా కూటమి నేతలు అధికారులపై ఒత్తిడి పెంచి ఓట్ల నమోదు ప్రక్రియకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమి తరఫున పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్ పేరును ఖరారు చేసి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో పట్టభద్రులు మాత్రమే ఓటర్లుగా ఉంటారు. వారికి ఓటర్లుగా నమోదుకు ఎన్నికల సంఘం పలు దఫాలుగా గడువు నిర్ణయించి ప్రకటించింది. అయితే ఆ దిశగా పట్టభద్రులు పెద్దగా ఓట్ల నమోదుకు ముందుకు రాలేదు. కూటమి నేతలు తొలుత దీనిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. తీరా అభ్యర్థిని ప్రకటించాక ప్రయత్నం చేసి హైరానా పడ్డా సమన్వయ లోపంతో నమోదు ప్రక్రియ మందకొడిగానే సాగింది. ఈ నెల రెండో తేదీన భీమవరంలో జరిగిన కూటమి ఆత్మీయ సదస్సులో ఎంఎల్‌సి అభ్యర్థి రాజశేఖర్ ఓట్ల నమోదుపై ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గస్థాయిలో ఆశించిన మేర ఓటర్ల నమోదు ప్రక్రియ సాగలేదని, తహశీల్దార్లు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు సంతకాలకు అనేక ఇబ్బందులు పెడుతున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి రవికుమార్‌తోపాటు జిల్లాకు చెందిన మరో మంత్రి నిమ్మల రామానాయుడు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్ల నమోదు చాలా కీలకమని, నియోజకవర్గాల్లో ఎంఎల్ఎలు బాధ్యత తీసుకుని నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇవే ఆదేశాలను జిల్లా కలెక్టరేట్లో జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులకు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియను జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదుపై సంబంధీకులకు అవగాహన కల్పించాలని, ఓట్ల నమోదుకు కృషి చేయాలని కలెక్టర్ తహశీల్దార్లను ఆదేశించినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో తహశీల్దార్లు మండల అధికారులకు, గ్రామాధికారులకు ఈ రెండు రోజులు ఈ పనిపై దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ల నమోదును ఎవరూ తప్పుబట్టాల్సిన అవసరం లేదు. తప్పుబట్టరు కూడా. అయితే ఉద్యోగులుగా ఉన్న ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు కావాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇదంతా కూటమి నేతల ఒత్తిడి ఫలితమేననే విమర్శలు విన్పిస్తున్నాయి. గతంలో ఈ విధానం లేదని కొందరు అధికారులు పెదవి విరుస్తుండటం గమనార్హం. గతంలో ఎవరికి ఇష్టముంటే వారు ఓటర్లుగా నమోదయ్యేవారని, ఇప్పుడు కచ్చితంగా నమోదు కావాలని బలవంతం చేయడం సరికాదని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఓటర్ల నమోదులోనే ఇన్ని ఒత్తిళ్లుంటే ఇక ఎన్నికల్లో అధికారపక్షం ఎన్ని అడ్డదారులు తొక్కుతుందోనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేసుకునేలా ఒత్తిడి కాకుండా అవగాహన కల్పించడంపై దృష్టి సారించాలని పలువురు సూచిస్తున్నారు.

రేపటితో గడువు పూర్తి

ఈ నెల ఆరో తేదీతో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు తుది గడువు పూర్తి కానుంది. అయితే ఇప్పటి వరకు కేవలం 30 వేల మంది మాత్రమే ఓటర్లుగా నమోదయ్యారు. గత ఎన్నికలతో పోలిస్తే ఇది బాగా తక్కువ. కేవలం 40 నుంచి 45 శాతం మంది మాత్రమే ఓటర్లు నమోదైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తుదిగడువు సమీపించడంతో కూటమి నేతలు, అటు అధికార యంత్రాంగం ఓటర్ల నమోదులో తలమునకలయ్యారు.

ఒత్తిడితో అధికారుల్లో ఆందోళన

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో ఉద్యోగులు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు కావాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేయడంపై అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే ఓటు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలో దరఖాస్తులను అందజేయాలనే నిబంధన ఉంది. అయితే అధికారులు వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతల్లో ఉన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అప్పగించిన సవాలక్ష పనులతో సతమతమవుతున్న ఉద్యోగులకు ఓటరు నమోదు తలకు మించిన భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో కూటమి నేతల తీరు ఎలాగుంటుందోననే ఆందోళన ఉద్యోగుల్లో ఎక్కువ కన్పిస్తోంది.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు నేతలు, విఆర్‌ఎలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఎలు) ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఎపి రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యాన చేపట్టిన ఈ ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విఆర్‌ఎలకు సంబంధం లేని పనులు అప్పగించరాదని, పిఆర్‌సి ప్రకారం వేతనాలు ఇవ్వాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని, అర్హులైన విఆర్‌ఎలకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా వేతనం పెంచకుండా వెట్టిచాకిరీ చేయించుకుందని దుయ్యబట్టారు. విఆర్‌ఎలు అందరికీ పిఆర్‌సి ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నామినీలుగా పని చేస్తున్న వారిని విఆర్‌ఎలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎలకు సంబంధం లేని ఇసుక ర్యాంపుల డ్యూటీలు, రైస్‌మిల్లుల వద్ద ధాన్యం డ్యూటీలు, ఇతర నైట్ డ్యూటీలు కేటాయిస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన విఆర్‌ఎలందరికీ వాచ్‌మెన్, అటెండర్, విఆర్‌ఒ తదితర ఉద్యోగోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా నాయకులు రవికుమార్, ఎస్.సాంబశివరావు, కె.లక్ష్మణరావు, ఎన్.షారోన్, యు.గంగాధరరావు, డి.సంధ్యారాణి, టి.కృష్ణకుమారి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కలెక్టర్‌చే బాలోత్సవం సావనీర్ ఆవిష్కరణ

బాలోత్సవం సావనీర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవం నాల్గో పిల్లల సంబరాల సావనీర్‌ను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో హేలాపురి బాలోత్సవ కమిటీ ముద్రించిన నాలుగో పిల్లల సంబరం జ్ఞాపకాల సంచికను సోమవారం జిల్లా అధికారుల సమక్షంలో ఆమె ఆవిష్కరించారు. బాలోత్సవం నిర్వాహక కమిటీ నేత గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ పిల్లల సంబరాల పేరుతో విద్యా, కళా సంబంధ అంశాల్లో విద్యార్థుల సృజనాత్మకతను పెంచేందుకు పిల్లల సంబరాల పేరిట కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికి నాలుగు పిల్లల సంబరాలు పూర్తయ్యాయని, ఐదో పిల్లల సంబరం జనవరిలో నిర్వహించబోతున్నామని ప్రకటించారు. ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల పిల్లల ప్రేమికులతో కలిసి ఈ బాలోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 40 కేంద్రాలు ఇలాంటి సంబరాలు జరుగుతున్నాయని తెలిపారు. ఐదో పిల్లల సంబరాలు వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూలులో నిర్వహించేందుకు స్కూలు యాజమాన్యం అంగీకరించిందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ సంఘాలు, సంస్థలకు చెందిన హేలాపురి బాలోత్సవం నిర్వాహకులు ఎంఎస్ఎంఎస్.కుమార్, విజిఎంఆర్.కృష్ణారావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎస్.కస్తూరిరావు, వి.సురేష్, మేతర అజయ్‌బాబు, పి.ఆంజనేయులు, డి.శివప్రసాద్, వి.శేషగిరిరావు, కె.సిద్ధార్థ, ఎం.సురేష్‌బాబు, కె.సోమ్లానాయక్, జి.సురేష్, ఎస్.రవి, కె.జనని, బి.సోమయ్య, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ వెంకటలక్ష్మమ్మ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారిగా ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డిఇఒ కార్యాలయంలో ఎడి-1 ఎంవి.అవధాని, ఎడి-2 షరీఫ్ ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనకాపల్లి డిఇఒగా పని చేసిన వెంకటలక్ష్మమ్మ బదిలీపై ఏలూరు జిల్లాకు వచ్చారు. ఇప్పటివరకు ఏలూరు డిఇఒగా పని చేసిన ఎస్ అబ్రహం బదిలీపై విద్యాశాఖ కమిషనరేట్‌కు వెళ్లారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించిన నార్త్ రీజియన్ అడిషనల్ జెడి శ్రీనివాసులు

మొక్క అందిస్తున్న ఫైర్ ఆఫీసర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నార్త్ రీజియన్ అడిషనల్ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాసులు నూజివీడు అగ్నిమాపక కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. సిబ్బంది సమస్యలు నియోజకవర్గంలో ఉన్న పరిస్థితులపై ఫైర్ ఆఫీసర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎటువంటి అగ్ని ప్రమాదం సంభవించినా వెంటనే స్పందించాలని, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యోగ పరంగా ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా షేక్ ముస్తఫాఅలీ, రవికుమార్ రుద్రాక్షి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులుగా షేక్ ముస్తఫాఅలీ, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్ రుద్రాక్షి ఎన్నికయ్యారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో రెండో రోజు సోమవారం డెలిగేట్స్ మీటింగ్ స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి 28 మండల శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నివేదికలు ప్రవేశపెట్టారు. కార్యదర్శి నివేదిక, ఆర్థిక నివేదిక, ఆడిట్ నివేదిక, మహిళా సబ్ కమిటీ నివేదిక, సిపిఎస్ సబ్ కమిటీ నివేదిక, మున్సిపల్ నివేదిక ప్రవేశపెట్టారు. అలాగే వివిధ సమస్యలపై తీర్మానాలు ప్రవేశపెట్టారు. సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని తీర్మానాలు చేశారు. నివేదికలను, తీర్మానాలను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం జిల్లా కమిటీ ఇప్పటివరకు పనిచేసిన నాయకులకు మెమోంటోలు అందించారు. ఆతిథ్యం ఇచ్చిన పెదవేగి మండలం శాఖ కమిటీకి కూడా అభినందన మెమోంటోలు అందించారు. మధ్యాహ్నం నుంచి నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి.మనోహర్‌కుమార్, పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో జిల్లా ఆఫీస్ బేరర్స్‌గా 19 మంది సభ్యులతో ఏకగ్రీవంగా కమిటీ ఏర్పడింది. జిల్లా అధ్యక్షులుగా షేక్ ముస్తఫా ఆలీ, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్ రుద్రాక్షి, జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎంవి.శ్యాంబాబు, జిల్లా సహాధ్యక్షులుగా జి.వెంకటేశ్వరరావు, మహిళా సహ అధ్యక్షురాలిగా ఎస్.సుధారాణి, జిల్లా కోశాధికారిగా జివి.రంగమోహన్, కార్యదర్శులుగా 13 మంది ఎన్నిక అయ్యారు. అలాగే జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బి.మోహన్ రావు, మిగిలిన నలుగురు సభ్యులుగా మొత్తం ఐదుగురితో ఆడిట్ కమిటీ ఏర్పడింది. రాష్ట్ర కౌన్సిలర్స్‌గా ఎనిమిది మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కమిటీ సంవత్సరకాలం ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల కమిటీకి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే ధ్యేయం

గ్రీవెన్స్‌లో ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఎస్‌పి నిర్వహించారు. ఆయన ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయా పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలు ఎక్కువ శాతం సైబర్ నేరగాళ్ల వలలో పడి పెద్ద మొత్తంలో సొమ్ములు పోగొట్టుకుంటున్నారన్నారు. ఎటువంటి యాప్‌లను నమ్మవద్దని ఆయన సూచించారు. యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుంటే తిరిగి చెల్లించే సమయాల్లో వంద శాతం అదనంగా చెల్లించాల్సిన అవసరం ఉంటుందని చెప్పారు. యాప్‌లు కూడా సైబర్ నేరగాళ్లకు ఒక వల అన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి 35 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ప్రతాప్‌శికిషోర్‌తో పాటు ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు సాయిరాం

పలువురి అభినందన

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పి.సాయిరాం జాతీయస్థాయి అంతర్ విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించే పది కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగు పందేల్లో రాష్ట్రం తరపున ప్రతినిధిగా పాల్గొననున్నారని కళాశాల ప్రధానోపాధ్యాయులు బొమ్మ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సాయిరాంతో పాటు, అతనికి శిక్షణ ఇచ్చిన కళాశాల పీడీ సురేష్‌కుమార్‌ను కళాశాల ప్రధాన ఆచార్యులతోపాటు, ఎన్‌సిసి విభాగం బాధ్యులు కెప్టెన్ శివశంకర్, లెక్చరర్ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన ఆచార్యులు మాట్లాడుతూ విద్యార్థి పి.సాయిరాం రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇంటర్ విశ్వవిద్యాలయ స్థాయి పది కిలోమీటర్ల క్రాస్ కంట్రీ రన్నింగ్ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. దీనిలో ఆయన తృతీయ స్థానం సాధించి, కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారన్నారు. దీని ఆధారంగా ఈ నెల 17వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మంగుళూరు ఆల్వాస్ కళాశాల వేదికగా నిర్వహించే జాతీయస్థాయి అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు తెలిపారు.

ధరల నియంత్రణకు చర్యలు

జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

వినియోగదారులకు స్థిరమైన ధరలకు నిత్యావసర వస్తువుల సరఫరాకు సంబంధించి ప్రభుత్వం సూచనలను జారీ చేసిందని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆయిల్, పప్పుధాన్యాలు, చక్కెర అసోసియేషన్, ఏలూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరా అధికారి, ఏలూరు అసిస్టెంట్ డైరెక్టర్, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్, రైతు బజార్ ఎస్టేట్ అధికారులు, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న ఆయిల్, పప్పు దినుసుల, బియ్యం హోల్‌సేలర్ డీలర్స్ అసోసియేషన్, వారి ప్రతినిధులు ముందుకొచ్చి ప్రత్యేక కౌంటర్లు/స్టాల్స్, స్థానిక సౌకర్యాల కింద సన్నబియ్యం, కంది పప్పును, ఆయిల్ స్థిరమైన ధరలకు విక్రయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అమలు చేయడానికి, సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం, కందిపప్పును, ఆయిల్ విక్రయించడానికి జిల్లాలో ఇప్పటికే 32 ప్రత్యేక కౌంటర్లు, రైతు బజార్లు, సూపర్ మార్కెట్స్, మాల్స్ ద్వారా ప్రజలకు సౌకర్యం కల్పించాలని తెలిపారు. ధరల నియంత్రణలో భాగంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇంకా అవసరమైన ప్రదేశాల్లో మరికొన్ని కౌంటర్లను ప్రారంభించాలని జిల్లా పౌర సరఫరా అధికారి ఆర్ఎస్ఎస్.సత్యనారాయణరాజును ఆదేశించారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో డిసెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు, చిట్ ఫండ్స్ వివాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, టెలిఫోన్ బకాయిల కేసులు, మున్సిపల్ ఆస్తి, నీటి పన్నుల కేసులను రాజీ చేస్తారని తెలిపారు. ప్రతి శనివారం అన్ని కోర్టుల్లో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నారని, పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్మన్ ప్రతిరోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం నిర్వహిస్తున్నారని, ఏలూరు కోర్టు పరిధిలోని కేసులనే కాకుండా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఇతర కోర్టుల పరిధిలోని కేసులను కూడా ఆన్‌లైన్ విధానంలో ఈ మధ్యవర్తిత్వం ద్వారా హాజరై తమ కేసులను రాజీ చేసుకోవాలని తెలిపారు.

గుండెపోటుతో మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు


రామకృష్ణ (ఫైల్‌ఫొటో)

ఉంగుటూరు మండలం తల్లాపురం గ్రామ మాజీ సర్పంచి పైడిముక్కల రామకృష్ణ (61) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన సర్పంచిగా పనిచేసిన సమయంలో గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్లు, బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దారు. అందుకు నిర్మల్ గ్రామ పురస్కార అవార్డును 2007లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చేతుల మీదుగా ఢిల్లీలోనూ, హైదరాబాదులో ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. 2006 నుంచి 2011 వరకూ సర్పంచిగా పనిచేశారు. అనంతరం రెండో పర్యాయం 2014 నుంచి 18 వరకు రెండోసారి సర్పంచిగా గ్రామానికి సేవలందించారు. రామకృష్ణ మృతదేహాన్ని మాజీ ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు సందర్శించి నివాళులర్పించారు.

మద్యం తాగి పాఠశాలకు ఉపాధ్యాయుడు

చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రుల వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని నెమలిపేట ఎంపిపి స్కూలులో ఉపాధ్యాయుడు పాఠశాలకు ఆలస్యంగా రావడమే కాకుండా మద్యం తాగి విద్యార్థులకు హాజరు వేయకుండా మధ్యాహ్నం ఎండలో గోడకుర్చీ వేపిస్తున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఎంఇఒ గిరి భగవాన్ దాస్ ఎదుట వాపోయారు. పాఠశాలకు తమ పిల్లలను పంపించబోమని, ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని ఎంఇఒకు వినతిపత్రం అందించారు.

26న అర్జీలతో హెచ్చరికలు జారీ

రైతు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న అర్జీలతో కూడిన హెచ్చరికలు జారీ చేయాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. రైతు, కార్మిక సంఘాల నాయకుల సమావేశం సోమవారం ఏలూరులో అన్నే భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండిస్తున్న అన్ని పంటలకూ కనీస మద్దతు ధర చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరించకుండా సిఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీన ఏలూరులో సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు సాధ్యం కాని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నారే తప్ప కార్మికుల ప్రయోజనాలపై నోరు మెదపడం లేదన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులు

ప్రజాశక్తి - భీమడోలు

నిత్యావసరాలు అందిస్తున్న మానవత సభ్యులు

మానవత స్వచ్ఛంద సంస్థ భీమడోలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం రెండు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఛైర్మన్ జి.నూకరాజు తెలిపారు. దీనిలో భాగంగా కేన్సర్ వ్యాధితో ఇబ్బంది పడుతూ, వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న జె.లక్ష్మి అనే మహిళకు సంస్థ తరపున రూ.ఐదు వేల నగదును అందించారు. సభ్యులు పి.అప్పారావు వ్యక్తిగతంగా 25 కేజీల బియ్యాన్ని ప్రతినిధుల చేతులమీదుగా ఇచ్చారు. మరొక కార్యక్రమంలో అర్జావారిగూడెం గ్రామానికి చెందిన ఒక కుటుంబ యజమాని సాల్మన్‌రాజు చనిపోయిన కారణంగా ఆయన కుటుంబం ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటుంది. దీనిని గమనించిన మానవత శాఖ సభ్యులు బాధిత కుటుంబ నివాసానికి వెళ్లి పరామర్శించారు. సంస్థ తరపున బియ్యం, నిత్యావసర వస్తువులు అందించారు. భీమడోలుకు చెందిన శ్రీ సాయిరాం క్లాత్ స్టోర్స్ వారు కుటుంబ సభ్యులకు దుస్తులు, దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో శాఖ సభ్యులు జి. అప్పారావు, యు.సత్యనారాయణ, ధనలక్ష్మి, చిలపర్తి ఆదినారాయణ పాల్గొన్నారు.

నూతన ప్రజాస్వామిక విప్లవంతోనే హక్కుల పరిరక్షణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆదివాసీ హక్కులు, ప్రజా హక్కులు పరిరక్షించాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవమే ప్రధాన లక్ష్యమని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు ప్రజలకు పిలుపునిచ్చారు. విప్లవ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ ఏలూరు మార్కెట్ యార్డ్ ఆవరణలోని అమరవీరుల స్థూపం వద్ద యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం సభ నిర్వహించారు. ఈ సభలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఏలూరు కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ దేశంలో మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన విధానమే ప్రజలకు, ఆదివాసీలకు, శ్రమజీవులకు, కష్టజీవులకు, కార్మికులకు హక్కుల రక్షణగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పల్లి గంగరాజు, కోరాడ అప్పారావు, బండి నాగేశ్వరరావు, చిట్టి శివ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామలింగేశ్వర స్వామి సన్నిధిలో చింతమనేని

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని బలివే గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి వారిని కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ దర్శించుకున్నారు. ఎంఎల్ఎ చింతమనేని దంపతులకు కార్యనిర్వాహణాధికారి పామర్తి సీతారామయ్య ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి దర్శనానికి విచ్చేసిన యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య, ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పేకాట స్థావరంపై దాడి చేసి చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. హెచ్‌సి ఎం.రాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అప్పలరాజుగూడెంలో పేకాట నిర్వహిసున్నారన్న సమాచారం మేరకు పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుటుంబ మనస్పర్థలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం సాయంత్రం జీలుగుమిల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఓ మహిళ కొంతకాలంగా కుటుంబంలో మనస్పర్థల కారణంగా సోమవారం ఇంటి పరిసరాల్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి వెంటనే జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయరూ..!

ప్రజాశక్తి - చింతలపూడి

ఆరుకాలం పండించిన పంట చేతికొచ్చే వరకు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తడిచిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవటానికి అనేక ఆంక్షలు పెడుతుండడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. మరో పక్క వాతావరణంలో మార్పులు రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం పూర్తిగా తడిచిపోవడంతో రైతులు ధాన్యాన్ని రోడ్లపై అరబెట్టుకుంటున్నారు. ముందుగా వేసిన రబీ పంటలో సాగులో భాగంగా క్రవేత్త ద్వారా వేసిన వరి పంట కోతలకు సిద్ధంగా ఉన్నాయి. మరో పక్క సాయంత్రం పూట వాతావరణంలో మార్పులు రావటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తడిచిన పచ్చి ధాన్యం 75 కేజీల బస్తాను తక్కువ ధరకే అమ్ముతున్నట్లు రైతులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని ప్రజా సంఘాల నాయకులు అధికారులను కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. చింతలపూడి మండలానికి తొమ్మిది లక్షల గోనెసంచులు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. గోనెసంచులు అందుబాటులోకి వచ్చాయా లేదా అనేది అధికారులు తెలియజేయాల్సి ఉంది.

ఈ ఏడాది వరి రైతులకు పెట్టుబడులు పెరిగినట్లు తెలిపారు. అంతే కాకుండా తుపాను ప్రభావం ఎక్కువగా ఉండటంతో పొలాల్లో నీరు ఎక్కువగా ఉండటంతో పంటకు తెగులు వచ్చి రైతులు ఇబ్బందులు పడ్డారు. మరో పక్క కూలి రేట్లు, వరి కోత మిషన్‌కు గంటకు రూ.2,200 చెల్లించాల్సి వస్తుంది. కౌలు రైతులదీ అదే పరిస్థితి.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం
ఎడిఎ నాగకుమార్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంగళవారం ఏర్పాటు చేస్తున్నాం. ధాన్యం తడిచినా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బందులు ఉంటే నేరుగా సంప్రదించండి.

రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - భీమడోలు

వేగం కన్నా ప్రాణం మిన్న అనే విషయాన్ని ప్రతి వాహనదారుడూ గుర్తుంచుకుని రహదారి నియమాలు పాటిస్తూ ప్రయాణాలు చేయాలని భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ కోరారు. భీమడోలు శ్రీ చైతన్య పాఠశాల ప్రధాన ఆచార్యులు డి.సోహిని ఆధ్వర్యంలో ప్రతి నెల పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యంతో స్మార్ట్ లివింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నవంబర్ నెలకు సేఫ్ ఇండియా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రోడ్డు ప్రయాణాలు, భద్రత ఇతర అంశాల గురించి అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానాచార్యులు తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులు పాఠశాల నుంచి ప్లకార్డులు ధరించి పురవీధుల్లో రోడ్డు భద్రత నియమాల గురించి నినాదాలు చేస్తూ ర్యాలీగా భీమడోలు జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్ఐ సుధాకర్, ఎఎస్ఐ వెంకటేశ్వరరావు రోడ్డు భద్రత నియమాలు పాటించని వాహనదారులను గుర్తించి వారికి విద్యార్థులతో పువ్వులు అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆర్ఐ ఉదయభాస్కర్, సమన్వయకర్త వెంకట్, డీన్ భార్గవ, ఎఒ ముఖేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటోలకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - కుక్కునూరు



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

రవాణా రంగం కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కుక్కునూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం వారు చేరాల్సిన గమ్యాన్ని ప్రాణాలు సైతం లెక్క చేయకుండా సురక్షిత ప్రాంతాలకు చేరవేర్చే ఆటో డ్రైవర్లు పార్కింగ్ స్థలం లేకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కుక్కునూరు మండల కేంద్రంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి, పికపింగ్ పాయింట్, డ్రాపింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని గతంలో ఎన్ని సార్లు అధికారులకు విన్నవించుకున్నా సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఆటో యూనియన్ అధ్యక్షులు పోచారపు వెంకటేశ్వర్లు, సిఐటియు సహాయ కార్యదర్శి తిరోజుల సురేష్, ఆటో డ్రైవర్లు దార కృష్ణ, గరటం హరీష్, లోకి, గోపి పాల్గొన్నారు.

లోపూడిలో డివైఇఒ విచారణ

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని లోపూడి మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల కమిటీ సభ్యులను, ఉపాధ్యాయులను నూజివీడు డివిజనల్ విద్యాశాఖాధికారి సేవియా నాయక్ విచారించారు. పాఠశాల యజమాన్య కమిటీ సభ్యులతో పాటు కోఆప్షన్ సభ్యులు ఎస్.బుజ్జిబాబు, చలమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఎస్ఎంసి సమావేశంలో తెల్ల కాగితాలపై సంతకాలు చేయించిన అంశంపై ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించి విచారణ చేపట్టారు. మధ్యాహ్న భోజనం పథకం ద్వారా పనిచేసే ఏజెన్సీ సభ్యులు సక్రమంగా వంట చేయడం లేదని పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఆరోపణల మేరకు సమాచారం రావడంతో గతంలో కూడా మండల విద్యాశాఖాధికారి బివిఎస్.సుబ్బారావు విచారణ చేపట్టారు. అప్పుడు అధిక శాతం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమయానికి కూడా వంట చేయడం లేదని, మెనూ ప్రకారం ఏజెన్సీ సభ్యులు వంట చేయడం లేదని ఫిర్యాదు చేశారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఒక్కొక్క తరగతి గది నుంచి ఒక్కొక్కరిని విద్యార్థుల తల్లిదండ్రుల శాతాన్ని బట్టి కమిటీ సభ్యులను 17 మందిని ఎన్నుకున్నారు. వారిలో 15 మంది హాజరై వారితో పాటు కో-ఆప్షన్ సభ్యులతో కలిపి విచారణ చేపట్టినట్లు డివైఇఒ తెలిపారు. వారి మాటలను స్టేట్‌మెంట్ రికార్డు చేయటంతో పాటు, వారి వద్ద నుంచి రాతపూర్వకంగా మ్యాటర్ తయారు చేసి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఫిర్యాదులు వచ్చిన మేరకే వారిని తీసేసినట్లు గ్రామస్తులతో సహా తెలిపారన్నారు. స్కూలు కమిటీ సభ్యుల సమావేశంలో కావాలనే గందరగోళం సృష్టించే సమయంలో అపోహలు ఫిర్యాదులు చేసి పత్రికాముఖంగా ఉపాధ్యాయులపై అభియోగం నెలకొల్పారని ఆయన తెలిపారు.

పెట్టుబడి సాయం అందించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకొస్తే ప్రతి రైతుకూ పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని చేసిన వాగ్దానాన్ని తక్షణం అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతాంగాన్ని ఆదుకోవాలంటూ రైతు సంఘం రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం స్థానిక చేపల తూము సెంటర్ వద్ద ఉన్న 27వ సచివాలయం కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రఘు, కురెళ్ల వరప్రసాద్, నాగం అచ్యుత్, తెర్లాపు శ్రీను, భజత్రి శ్రీనివాస్, మహమ్మద్ అబ్దుల్ హకీమ్, గొర్లి స్వాతి పాల్గొన్నారు.

చింతలపూడి : రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతు ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సచివాలయాల కార్యదర్శులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్ ఆచార్యులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ మాట్లాడుతూ పెట్టుబడి సాయం వెంటనే అందించాలని కోరారు.

ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే నగదు

కొక్కిరపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంఎల్ఎ చింతమనేని

ప్రజాశక్తి - పెదపాడు

రైతులు వద్ద నుంచి ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మండలంలోని కొక్కిరపాడులోని రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఉదయం ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. రైతు బాగుండాలి, వ్యవసాయం లాభసాటిగా ఉండాలనే నినాదంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతుందన్నారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని చెప్పారు.

ఫ్యాక్టరీని సందర్శించిన సైన్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా సైన్స్ విద్యార్థులు సోమవారం దెందులూరులోని న్యూట్రిటెక్ సాల్వెంట్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీని సందర్శించారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు కె.రమేష్ విద్యార్థులకు క్షేత్ర పర్యటన ప్రాముఖ్యతను తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా వస్తు ఉత్పత్తి ప్రక్రియను అర్థం చేసుకుంటారని, భవిష్యత్తులో పరిశ్రమల స్థాపనకు కావల్సిన ప్రేరణ పొందుతారని చెప్పారు.

పలువురికి అబ్దుల్‌కలాం లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులను మండల పరిధిలోని ఈదర గ్రామానికి చెందిన అయ్యంకి సురేష్‌బాబు, దొండపాటి చిన్న వెంకటేశ్వరరావు, లంకపల్లి ఎంకోజీలు అందుకున్నారు. విజయవాడకు చెందిన తెలుగు రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆ సంస్థ సోమవారం నిర్వహించిన ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవాల్లో భాగంగా పలు రంగాల్లో ప్రజలకు విశేష సేవలందించినందులకు అయ్యంకి సురేష్‌బాబు, దొండపాటి చిన్న వెంకటేశ్వరరావు, లంకపల్లి ఎంకోజీలకు తెలుగు కళారత్న సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఉలవపూడి వెంకటరత్నం చేతులమీదుగా డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులను అందుకున్నారు.

విద్యార్థులకు ఆధార్ కార్డ్ అప్‌డేట్ కష్టాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


ఆధార్ కార్డ్ అప్‌డేట్ కోసం బారులు తీరిన ప్రజలు

విద్యార్థులు ఆధార్ కార్డ్ అప్‌డేట్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. నూజివీడు పట్టణంలోని ఆధార్ కేంద్రాల వద్ద ఉదయం ఎనిమిది గంటల నుంచి విద్యార్థులు, ప్రజలు బారులు తీరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన అపార (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు కోసం జనన ధ్రువీకరణ పత్రంలో ఉన్న అక్షరాలు అదేవిధంగా ఆధార్‌లో లేకపోతే అపార రిజిస్ట్రేషన్ జరుగడంలేదు. దీంతో విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాల వద్దకు తరలి వస్తున్నారు. ఆధార్ కేంద్రాలు నూజివీడు పట్టణంలో కేవలం మూడు ఉన్నాయి. ఆ మూడు కేంద్రాల్లో ఒక కేంద్రంలోని అప్‌డేట్, స్పెల్లింగ్ మిస్టేక్స్ సరి చేస్తారు. నూజివీడు పట్టణంలో ఒక్క కేంద్రం కావడంతో ఉదయం ఎనిమిది గంటలకే విద్యార్థులు, ప్రజలు బారులు తీరారు. ఆ ఒక్క కేంద్రంలో కూడా రోజుకు 20 మందికి మాత్రమే అప్‌డేట్ చేయగలుగుతున్నామని చెబుతున్నారు. మిగిలిన రెండు ఆధార్ కేంద్రాలకు అప్‌డేట్ సౌకర్యం కల్పించాలని, మరికొన్ని ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఆధార్ కేంద్రాలను పెంచి అప్‌డేట్ చేసేలా చూడాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

300 పడకల ఆసుపత్రిగా కామవరపుకోట పిహెచ్‌సి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ హామీ

ప్రజాశక్తి - కామవరపుకోట


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

కామవరపుకోటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరలో 300 పడకల ఆసుపత్రిగా మార్చడానికి కృషి చేస్తానని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలు ఎన్‌హెచ్‌ఎం నిధులతో నూతనంగా నిర్మిస్తున్న పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేస్తే సహించేది లేదన్నారు. ఈ కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అన్ని వసతులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, సర్పంచి కరిపోతు అనూష, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోనేరు వెంకటసుబ్బారావు, ఘంట సత్యం బాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఘంటా సుధీర్ బాబు, మద్దిపోటి నాగేశ్వరరావు, వేముల హనుమంతు, అబ్బూరి సాయికృష్ణ, వైద్యాధికారి టివిఎల్.ప్రసన్నకుమార్, మండల ఆర్అండ్‌బి ఇంజినీర్ సొంగా సుందరరావు, కాంట్రాక్టర్ నరసింహరాజు పాల్గొన్నారు.

అయ్యప్ప, భవానీ మాలధారులకు అల్పాహారం

ప్రజాశక్తి - దెందులూరు

అయ్యప్ప, భవాని మాల దీక్షాదారులకు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ప్రతిరోజూ వడ్డె (అల్పాహారం) ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఏటా చింతమనేని ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహిస్తున్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ఆయన చేస్తున్న ప్రజా సేవా కార్యక్రమాలను పలువురు అభినందిస్తున్నారు. సోమవారం చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో స్వాములకు అల్పాహారం అందించారు. దుగ్గిరాలలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద నిత్యం జరుగుతున్న స్వాములకు, భవానీలకు వడ్డె (అల్పాహార) కార్యక్రమాలను సోమవారం ఉదయం దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ స్వయంగా పర్యవేక్షించి, స్వాములు, భవానీలతో కలిసి వడ్డె స్వీకరించారు. ప్రతి నిత్యం భారీ సంఖ్యలో వచ్చే స్వాములకు, భవానీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అల్పాహారం అందించేలా ఏర్పాట్లు చేయాలని ఎంఎల్ఎ చింతమనేని తన సిబ్బందికి సూచించారు. కోవిడ్ విలయ తాండవం చేస్తున్న సమయంలో సైతం కోవిడ్ కేంద్రాల వద్ద పేషంట్ల బంధువులకు, లాక్‌డౌన్ సమయంలో హైవేపై ప్రయాణించే ప్రయాణికులకు, లారీ డ్రైవర్లకు కూడా ఆహారాన్ని అందించడంతో ఆయన సేవలను పలువురు అభినందిస్తున్నారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: -1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట, కమల హాస్పిటల్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్, అక్షరానంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, జిబిమాల్ సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్ :9492934845, -DRNO :10-11-5/2 , 1 st Floor, Ganesh Chowk Center , Near Ravindra bharathi school, NIDADHAVOLU

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-11-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2638.07 గ్రాముల వస్తువులు కుదువపెట్టిన పాత బంగారం నగలు #238-4-11, Subbammadevi High School Road, Opp.Zed Labs, R.R.Peta, Eluru- 534 002. నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road, Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager, p.hemanth kumar-80746-56196

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, కాకినాడ
D.O.P. No. 30/2022
Between:
ముదపాక సంతోష్‌కుమార్ -పిటిషనర్
మరియు
ముదపాక (జుత్తుక) జ్యోతి ప్రియాంక -రెస్పాండెంటు
రెస్పాండెంటు అడ్రసు:
ముదపాక (జుత్తుక) జ్యోతి ప్రియాంక, W/o. సంతోష్‌కుమార్, వయస్సు 28 సం॥రాలు, D/o. జుత్తుక పరమేశ్వరరావు, డోర్ నెం. 13-2-8, గుబ్బల కేశవరావు వీధి, ఉండ్రాజవరం రోడ్, తణుకు - 534211, పశ్చిమగోదావరి జిల్లా.
పై నెంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు వారి ద్వారా సమనులు పంపించినను తీసుకొనక బుద్ధిపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున సదరు కోర్టు వాయిదా 26-11-2024 సం॥రం తేదీన ఉదయం 10.30 ని॥లకు ఉండి ఉన్నది. ఆరోజు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు ఏమైన ఉన్నచో తెలియపరచుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం తెలుపబడును.
(శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం)
ఏలూరి సుబ్రహ్మణ్యం, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9848333171

'పది' విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి -ముదినేపల్లి

ముదినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 11 మంది విద్యార్థులకు సోమవారం నగదు, ప్రోత్సాహక బహుమతులు అందించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 550 మార్కులు పైన ఉత్తీర్ణత సాధించిన 11 మంది విద్యార్థులకు ఎన్ఆర్ఐలు దొడ్డపనేని బాబూరావు, రామకృష్ణ ఆర్థిక సాయంతో ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ చేతులమీదుగా 11 ల్యాప్‌టాప్‌లు, రూ.ఐదు వేలు నగదును అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ దాతలు ఈ విధంగా విద్యార్థులను ప్రోత్సహించటం చాలా సంతోషకరమన్నారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వటం చాలా ఆనందదాయకమని కొనియాడారు. వీటిని మంచిగా ఉపయోగించుకుని మంచి మార్గంలో ప్రయాణించాలని, కన్నవారికి, చదువు నేర్పిన గురువులకు, ఉన్న ఊరికి మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం పడాలి జెడ్‌పి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పదో తరగతిలో 550 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, ప్రభుదాస్, ఎన్‌డిఎ నాయకులు, వీరమల్లు నరసింహారావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లెళ్లగూడెంలో పార్వతి వర్ధంతి సభ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని జిల్లెల్లగూడెం పంచాయతీ మనుగోపలలో కారం పార్వతి 27వ వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనుగోపల గ్రామం నుంచి కారం పార్వతి స్మారక స్థూపం వరకూ భారీ ర్యాలీ నిర్వహించి గిరిజన సాంప్రదాయ నృత్యాలు, నినాదాలు చేశారు. రైతు కూలీ సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్.నాగరాజు సుత్తి కొడవలి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నాయకులు నవలం రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రజా కళాకారుల పాటలు, ఆదివాసి నృత్యాలు సభికులను అలరించాయి.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - కామవరపుకోట

శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాన్ని స్వదినియోగ పర్చుకుని మహిళలు ఆర్థికంగా, ఆరోగ్యం, మానసికంగా ముందంజలో ఉండాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ స్త్రీ,శిశు సంక్షేమ శాఖ కెవివిఎల్.పద్మావతి అన్నారు. మండలంలోని వీరిశెట్టిగూడెం అడ్డరోడ్డు సమీపంలోని ఎన్‌టిఆర్ మహిళ ప్రాంగణంలో బ్యూటీషన్, మగ్గం వర్క్ శిక్షణా ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణా పూర్తి చేసుకున్న 55 మందికి అభినందనలు తెలిపారు. అభ్యర్థులు చేసిన కుట్లు, అల్లికలు వీక్షించి వారికి సర్టిఫికెట్లు అందించారు.

కోర్టులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత సంబంధమైన వ్యాధులతో పలు రకాలైన దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమిస్తాయని వైద్యులు తెలిపారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి ఉచిత దంత చికిత్స అందించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో రాయితీపై మరింత మెరుగైన చికిత్స అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 15వ అదనపు జిల్లా జడ్జి నాగ శైలజ, సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు, సెకండ్ అడిషనల్ బ్యూటిఫుల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ పార్వతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుపల్లి సత్యప్రకాష్, దంత వైద్యులు రాజేష్ కుమార్, డాక్టర్ రచనశ్రీ, డాక్టర్ స్ఫూర్తి, డాక్టర్ గ్లోరీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి

ప్రజాశక్తి - కలిదిండి

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయల మొక్కలను పెంచడం ఉత్తమ మార్గమని వ్యవసాయ శాఖాధికారి విద్యాసాగర్ అన్నారు. స్థానిక అగ్రికల్చర్ కార్యాలయంలో కిచెన్ గార్డెన్‌పై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెరటి తోటల పెంపకం, అవలంభించాల్సిన విధానాన్ని వివరించారు. పెరటి తోటల వల్ల అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు రసాయన రహిత ఆహారం అందించవచ్చని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కరుణకుమారి అన్నారు. మూలలంక, కోరుకొల్లు, కలిదిండి పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోండి

పోలవరం :పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం ఈ నెల ఆరవ తేదీలోగా పూర్తి చేసుకోవాలని తహశీల్దార్ సాయిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల నమోదు కోసం సంబంధిత సర్టిఫికెట్ల నకళ్లతో తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, నిడమర్రు మండలం, పెద నింద్రకొలను గ్రా కాపురస్తులు పచ్చాకుల వెంకట సుబ్బారావు, తండ్రి: పచ్చాకుల సత్యనారాయణ అను నా యొక్క ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. దస్తావేజు నెం.3086/2019, ది.30-10-2024వ తేదీ నా స్వగ్రామం పెదనింద్రకొలను నుండి గణపవరం జిరాక్సు సెంటరుకు జిరాక్సు తీయించు నిమిత్తం వెల్లుచుండగా దారి మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

పచ్చాకుల వెంకటసుబ్బారావు
తండ్రి: పచ్చాకుల సత్యనారాయణ,
పెదనింద్రకొలను, నిడమర్రు మండలం,
ఏలూరు జిల్లా. సెల్: 9346446111